# సాక్షి సిద్దిపేట

గురువారం । 16 । మార్చి । 2023






**లారీల కోసం ఆందోళన** 8లో..

రైస్‌మిల్లు నుంచి వెళ్లిన బియ్యం లారీలు గోదాం వద్ద నెలల తరబడి ఖాళీ కాకపోవడంపై జిల్లా రైస్ మిల్లర్ల సంఘం ఉపాధ్యక్షుడు శ్రీధర్‌గుప్తా ఆగ్రహం వ్యక్తం చేశారు.



**గజవాహనుడి దివ్యదర్శనం**

బ్రహ్మోత్సవాలతో నాచగిరి అలరారుతోంది. ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి గజవాహనం అధిష్టించి పురవీధుల్లో ఊరేగారు. 8లో..



**బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం**

ప్రభుత్వం చెప్పిన పనులన్నీ చేస్తున్నా.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామే తప్పా బిల్లులు మాత్రం రావడం లేదని సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 9లో..

## న్యూస్‌రీల్

### పోలీస్ స్టేషన్ రిసెప్షనిస్టులకు అవార్డులు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న ముగ్గురు రిసెప్షనిస్టులకు అవార్డులు లభించినట్లు అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పరివర్తన స్కాలర్‌షిప్ ప్రోగ్రాం, కమాండేషన్ ఆఫ్ బెస్ట్ రిసెప్షన్ ఫంక్షన్ వర్టికల్ 2023 కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీజీపీ అంజనికుమార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీపీ కార్యాలయం నుంచి అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోహెడ్ పోలీస్ స్టేషన్‌లోని రేణుక, ములుగు పీఎస్‌లో శ్రీలత, మర్కుక్ పీఎస్‌లో బాలకృష్ణ అవార్డులు అందుకున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

### నేత్రపర్వంగా మూల మహోత్సవం



వర్గల్(గజ్వేల్): చదువుల తల్లి కొలువుదీరిన వర్గల్ శ్రీవిద్యా సరస్వతీ క్షేత్రంలో బుధవారం మూల మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి పర్యవేక్షణలో అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, లలితాపారాయణం, సప్తశతీ పారాయణం, చండీహోమం నిర్వహించారు. చతుషష్ట్యోపచార పూజలు, కుంకుమార్చన చేశారు. సామూహిక లక్ష పుష్పార్చన జరిపారు. వేడుకలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించారు.

### పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

కోహెదరూరల్(హుస్నాబాద్): టీఎస్‌పీఎస్‌సీ నిర్వహించిన పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని చెంచెర్వుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పేపర్ లీక్‌జీలో ఎవరి హస్తం ఉన్నా.. వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రమేశ్, వినోద్, నాగరాజు, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ నేడు దేశానికే దిక్సూచి



మాట్లాడుతున్న మాదాసు శ్రీనివాస్

గజ్వేల్: ఒకప్పుడు కరువుతో అల్లాడిన తెలంగాణ సీఎం కేసీఆర్ దూరదృష్టితో నేడు దేశానికే అన్నపూర్ణగా మారిందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణం, ఉచిత కరెంటు, రైతు బంధు, రైతుబీమా తదితర పథకాలతో వ్యవసాయరంగాన్ని కేసీఆర్ పండుగలా మార్చారన్నారు. బ్యాంకుల్లో రుణాలను తీసుకున్న ఎన్‌పీఏ ఖాతాదారులకు యూనియన్ బ్యాంకు, స్టేట్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకుల్లో 50 నుంచి 80 శాతం వరకు మాఫీ ప్రకటించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవడానికి 31లోగా తమ బకాయిలను చెల్లించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, సహకార సంఘం చైర్మన్ జేజాల వెంకటేశంగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి జాన్‌వెస్లీ, సూపర్‌వైజర్ మహిపాల్, డైరెక్టర్లు లలిత, బొల్లారం ఎల్లయ్య, భాస్కర్‌రెడ్డి, బాలకిషన్, యాదగిరి, మతీన్, రూబెన్, నర్సింలు, అత్తెల్లి రవి, ఎన్‌సీ శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట బాలుర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



హుస్నాబాద్‌లోని ఓ పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

# తొలిరోజు ప్రశాంతం

- ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు
- 92 శాతం హాజరైన విద్యార్థులు
- ఆలస్యంతో ఏడుగురికి అనుమతి నిరాకరణ

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు తొలిరోజు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 41 పరీక్షా కేంద్రాల్లో జనరల్ విభాగంలో 9,454 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 541 మంది గైరాజరయ్యారు. 8,913 మంది పరీక్ష రాశారు. ఒకేషనల్ విభాగంలో 2,462 మందికి గాను 2,082 హాజరుకాగా 380 మంది వివిధ కారణాలచేత పరీక్ష రాయలేదు. జనరల్, ఒకేషనల్ మొత్తంగా 11,916 మంది విద్యార్థులకు గాను 92శాతంతో 10,995 మంది పరీక్ష రాయగా, 921 మంది గైర్హాజరయ్యారు. సింహభాగం విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోగా కొన్ని పరీక్షా కేంద్రాల్లో పలువురు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించక పోవడంతో వారు ఇళ్లకు వెనుదిరిగి పోయారు.

చేర్యాలలో ఒకరు, హుస్నాబాద్‌లో ఐదుగురు, సిద్దిపేటలో మరో విద్యార్థి మొత్తం ఏడుగురు విద్యార్థులు నిమిషం నిబంధన కారణంగా పరీక్ష రాయలేక పోయారు. కాగా బుధవారం జనరల్ విభాగంలో తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతంతో పాటు ఒకేషనల్‌లో జనరల్ ఫౌండేషన్ పరీక్షలు జరిగాయి. కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కేంద్రాన్ని అడిషనల్ డీసీపీ మహేందర్, డీఐఈఓ సూర్యప్రకాశ్ సందర్శించారు. చేర్యాల పరీక్షా కేంద్రాలను పరీక్షల కమిటీ సభ్యులు మంగరాజు, విజయేందర్‌రెడ్డిలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిట్టపల్లి రెసిడెన్షియల్ పాఠశాల పరీక్షా కేంద్రాన్ని డీఐఈఓ సూర్యప్రకాశ్ తనిఖీ చేశారు.



సహాయకులతో పరీక్షకు వస్తున్న దివ్యాంగులు

### పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

సిద్దిపేటకమాన్: ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ తెలిపారు. పరీక్షలు జరుగుతున్న సిద్దిపేట పట్టణంలోని పలు కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఏమైనా సమస్య ఉంటే ఇన్విజిలేటర్లకు తెలపాలన్నారు. పరీక్ష ముగిసిన తర్వాత పేపర్లతో పాటు ఎస్కార్ట్‌గా పోలీసులు స్ట్రార్ రూమ్‌కు తీసుకెళ్తారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటున్నందున గుమిగూడి ఉండకూడదని సూచించారు.

### రవాణా సౌకర్యం లేక..

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సెంటర్‌కు ఐదుగురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు. దీంతో వారిని పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వలేదు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి సరైన రవాణా సౌకర్యం లేక, బస్సులు, ఆటోలు సమయానికి రాక ఆలస్యంగా వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. రామవరం నుంచి ఇద్దరు, మంచినీళ్లబండ నుంచి ఇద్దరు, కరీంనగర్ నుంచి ఒకరు సమయానికి కేంద్రానికి చేరుకోలేదు. దీంతో పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో ఇళ్లకు వెనుతిరిగి వెళ్లిపోయారు.



ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు



సెంటర్ వద్ద భద్రతను పరిశీలిస్తున్న అదనపు డీసీపీ అడ్మిన్ మహేందర్ పక్కన డీఐఈఓ సూర్యప్రకాశ్

### పోలీసులు జవాబుదారిగా ఉండాలి : సీపీ



అధికారులతో మాట్లాడుతున్న సీపీ శ్వేత

మర్కూక్(గజ్వేల్): ప్రజలకు పోలీసులు జవాబుదారిగా ఉండాలని సీపీ శ్వేత అన్నారు. బుధవారం మర్కూక్ పోలీస్‌స్టేషన్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సీఎం నియోజకవర్గంలోని మండలం కావడంతో ఎప్పటికప్పుడు గ్రామాల్లో ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులకు పోలీస్ వ్యవస్థపై నమ్మకం కల్పించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. విధులు సక్రమంగా నిర్వహిస్తున్నందున పోలీసులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ రమేశ్, ఎస్‌ఐ హరీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళా క్రికెట్ కోచింగ్‌కు ఎంపికలు

సిద్దిపేటఎడ్యుకేషన్: మహిళా క్రికెట్‌ను అభివృద్ధి చేసేందుకు మాజీ కోచ్‌లు రవి శాస్త్రి, అరుణ్, శ్రీధర్ స్థాపించిన కోచింగ్ బియాండ్ అనే సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత శిక్షణను అందిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందుస్తాన్ యూనీలివర్ సంస్థ భాగస్వామ్యంతో 25 మందిని ఎంపిక చేసి మూడు సంవత్సరాల కాలానికి స్కాలర్‌షిప్ సైతం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆన్‌లైన్‌లో తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 18న స్థానిక జయశంకర్ స్టేడియంలో ఉదయం 8.15 గంటలలోగా హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9849955478 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

**డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి**



మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో వడ్డీలేని రుణాల నిధుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వశక్తిలతో రాణించేలా ప్రభుత్వం రుణ సహాయం అందిస్తుందన్నారు. కుట్టు శిక్షణ, ప్రైవేట్ వ్యాపారాలు తదితర ఉపాధి అవకాశాలు ఏర్పరచుకునేందుకు ఈ సాయం అందిస్తున్నారన్నారు. మండల వ్యాప్తంగా 1,009 మహిళా సంఘాలకు రూ.1.60 కోట్లతో వడ్డీ లేని రుణాల అందించేలా నిధులు విడుదల చేసిందన్నారు. దేశ బాగుకు సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని ఆయన మహిళలను కోరారు. అనంతరం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల నిధుల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, ఎంపీపీ ర్యాగల్ల సుగుణ, రైతు బంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులురాలు చిట్టి మాధురీరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబ, ఎంపీడీఓ రాంరెడ్డి, ర్యాగల్ల దుర్గయ్య, మంచాల కనుకరాంలు, ఆరుట్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వడ్లను ఒలిచి.. తలంబ్రాలకు సిద్ధం



తలంబ్రాల దీక్షలో వడ్లను ఒలుస్తున్న మహిళలు

గజ్వేల్‌రూరల్: భద్రాచలంలో సీతారాముల కల్యాణోత్సవానికి తలంబ్రాలను సిద్ధం చేసే అవకాశం ఈ ప్రాంత భక్తులకు రావడం గర్వకారణమని రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు పేర్కొన్నారు. పట్టణంలోని కిరాణా వర్తకసంఘం భవనంలో బుధవారం శ్రీరామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో తలంబ్రాల దీక్షలో భాగంగా పలువురు మహిళా భక్తులు రామనామాన్ని స్తుతిస్తూ గోటితో వడ్లను ఒలిచి తలంబ్రాల కోసం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో చేపడుతున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను గుర్తించి భద్రాచల దేవస్థానం నుంచి వడ్లను తలంబ్రాలుగా సిద్ధం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. తలంబ్రాల దీక్షలో పాల్గొనే అవకాశం లభించడం పట్ల మహిళా భక్తులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రతియేడు తమకు ఇదే మాదిరిగా అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిరాణ వర్తకసంఘం నాయకులు సిద్ది బిక్షపతి, మెత్రాములు, వైకుంఠం, శ్రీనివాస్, యాదగిరి, సత్యనారాయణ, అంజయ్య, తోట బిక్షపతి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్



సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని కమిషనర్ ఎన్.శ్వేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి మార్చి 23 ఉదయం 6 గంటల వరకు ఈ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. ఈ సమయంలో ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యలకు శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలన్నారు. అలాగే మార్చి 23వ తేదీ వరకు డీజే సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కొనసాగుతాయన్నారు.


### 'తాగునీటి సరఫరాలో ఇబ్బంది ఉండొద్దు'



మాట్లాడుతున్న రోజాశర్మ

సిద్దిపేటజోన్: రానున్న వేసవికాలం నేపథ్యంలో జిల్లా యంత్రాంగం భవిష్యత్ ప్రణాళికలు తప్పనిసరిగా సిద్ధం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ సూచించారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ, ఆర్థిక వనరులు అంశాలపై సమీక్ష నిర్వహించారు. వేసవిలో తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు, అంతరాయం లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ మరమ్మతులకు వస్తే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మన ఊరు – మన బడి పథకంలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమేశ్, జెడ్పీటీసీలు కవిత, లక్ష్మి, సిద్ధప్ప, రహీం, రవీందర్‌రెడ్డి, మంగ, మంగమ్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సివిల్ సర్వీసెస్ ఫుట్‌బాల్ పోటీలకు నాగేశ్



గజ్వేల్‌రూరల్: ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌లో 18వ తేదీ నుంచి 23 వరకు జరుగనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు గజ్వేల్ మండలం జాలిగామలోని జెడ్పీహెచ్‌ఎస్‌లోని వ్యాయామ ఉపాధ్యాయుడు ఈ. నాగేశ్ ఎంపికయ్యాడు. ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన సెలక్షన్స్‌లో తెలంగాణ నుంచి మొత్తం 20 మందిని ఎంపిక చేయగా... వారిలో సిద్దిపేట జిల్లాకు చెందిన నాగేశ్‌కు స్థానం లభించడంపై డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీవైఎస్‌ఓ నాగేందర్‌తో పాటు ఉపాధ్యాయ బృందం, పీఈటీఏ టీఎస్ అధ్యక్షుడు సతీశ్, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ అభినందనలు తెలిపారు.

# పది పరీక్షలకు ప్రణాళికలు సిద్ధం

**జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి**



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పది వార్షిక పరీక్షల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం మండల పరిధిలోని మల్లుపల్లి, ఆరెపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాల, అక్బర్‌పేట - భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న తీరుతెన్నులను పరిశీలించారు. అనంతరం మిరుదొడ్డి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. పది పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 84 పరీక్షా కేంద్రాలు, 23 రూట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 14,186 మంది రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఏడుగురు ప్రైవేట్ విద్యార్థులు మొత్తం 14,193 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు 46 మంది కస్టోడియల్ అధికారులు, 10 మంది సీక్రెట్ కస్టోడియల్ అధికారులు, 5 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రూట్ అధికారులు ఐదుగురు, అడిషనల్ రూట్ అధికారులు మరో ఏడుగురిని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించనున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరాలను అమర్చుతామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జోగు ప్రభుదాసు, నోడల్ ఆఫీసర్ అంజిరెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజిరెడ్డి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



న్యూట్రిషన్ కిట్లను అందిస్తున్న అధికారులు

**రాష్ట్ర ఆయుష్ విభాగం డైరెక్టర్ ప్రశాంతి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పోషకాహార పదార్థాలను తీసుకున్నపుడే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలంగాణ ఆయుష్ విభాగం డైరెక్టర్ ప్రశాంతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులతో కలిసి విద్యార్థినులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు సరైన సమయంలో పోషకాలను తీసుకుంటేనే వారిలో జ్ఞాపకశక్తి, రోగ నిరోధక శక్తి పెరిగి, మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. ప్రైవేట్‌కు దీటుగా రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులు సేవలు అందిస్తున్నాయన్నారు. విద్యార్థులకు హెల్త్ న్యూట్రిషన్, హైజీన్ వంటి అంశాలపై అవగాహన కల్పించిడం ద్వారా వారికి ఆయుర్వేదంపై నమ్మకం పెరుగుతుందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లను వాడటం మానేసి, చదువుకు అధిక సమయం వెచ్చించాలన్నారు. అలాగే మంచి కలలు కనండి వాటిని సాధించడం కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం ఆయుర్వేదానికి సంబంధించిన మందులు, రాగుల లడ్డులు తదితరవాటితో కూడిన కిట్లను విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆమెకు గొల్లభామ చీరలను అందజేశారు. కార్యక్రమంలో ఆయుష్ విభాగం అడిషనల్ డైరెక్టర్ లింగరాజు, హోమియోపతి కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, ఏడీ పరమేశ్వర్ నాయక్, ఆర్‌డీడీ రవినాయక్, సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ, జిల్లా ఆయుష్ విభాగం అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కుకునూరుపల్లి పరిశోధకుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీకాంత్

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన పి. శ్రీకాంత్ శిక్ష శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్నాడు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విభాగంలో శిక్ష శాస్త్ర విభాగ అధ్యక్షులు కె.కాదంబిని పర్యవేక్షణలో విద్యార్థుల త్మ సంప్రత్యయ ఉపలబ్ధిపై శ్రీకాంత్ గ్రంథాన్ని రచించారు. అందుకుగాను శ్రీకాంత్ డాక్టరేట్‌కు ఎంపికవ్వడంతో బుధవారం తిరుపతిలో అందుకున్నారు. తెలంగాణాలో ఇలాంటి డాక్టరేట్ అందుకున్న అతికొద్ది మందిలో శ్రీకాంత్ ఒకరు. డాక్టరేట్ రావడానికి తల్లి దండ్రులు, గురువుల ప్రోత్సాహం అందించారని శ్రీకాంత్ తెలిపారు.

### మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడపకూడదని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు జడ్జి జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని పలు చోట్ల రెండు రోజుల క్రితం తమ సిబ్బందితో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లో ఎనిమిది మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బుధవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన జడ్జి రమేశ్‌బాబు రూ.18,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

### తృటిలో తప్పిన ప్రమాదం



నారాయణఖేడ్: బస్సు టైర్‌లోంచి పొగలు వస్తున్న దృశ్యం

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ బస్సు వెనుక టైర్ల నుంచి అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. ఈ సంఘటన నారాయణఖేడ్ పట్టణ శివారు మంగల్‌పేట్‌లో బుధవారం చోటు చేసుకుంది. నారాయణఖేడ్ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు ఎస్.జి హుక్రానకు వెళ్లి ప్రయాణికులను బస్టాండ్‌లో విడిచిపెట్టి డిపోకు వెళ్తోంది. ఈ క్రమంలో మంగల్‌పేట్ హనుమాన్ మందిరం సమీపంలో ఒక్కసారిగా వెనుక టైర్ నుంచి మంటలు వచ్చాయి. దీంతో స్థానికులు గమనించి విషయాన్ని డ్రైవర్‌కు తెలపడంతో వెంటనే బస్సును నిలిపివేశారు. డ్రైవర్, కండక్టర్ స్థానికుల సహాయంతో మంటలను ఆర్పివేశారు. ఆ సమయంలో బస్సులో ఎవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

### నిందితుడి అరెస్ట్

మద్దూరు(హుస్నాబాద్): ఫిబ్రవరి 18వ తేదీన లైంగికదాడికి గురైన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దూల్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామానికి చెందిన జోగిని వంశీని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని బుధవారం హుస్నాబాద్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు. కోర్టు 15 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు.

# లారీల కోసం రైతుల ఆందోళన

- గోదామును ముట్టడించిన వైనం
- సమస్యను పరిష్కరించాలని డిమాండ్



కౌడిపల్లి: గాయత్రి గోదాంను ముట్టడించిన పైడి శ్రీధర్ గుప్తా, రైతులు

కౌడిపల్లి(నర్సాపూర్): రైస్‌మిల్లు నుంచి వెళ్లిన బియ్యం లారీలు గోదాం వద్ద నెలలతరబడి ఖాళీ కాకపోవడంతో జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు పైడి శ్రీధర్‌గుప్తా ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులతో కలిసి గోదాం ముట్టడించి మేనేజర్, అధికారులను నిలదీశారు. ఈ సంఘటన కౌడిపల్లి మండలం తునికి (వెంకట్రావుపేట) సమీపంలోని గాయత్రి గోదాంవద్ద బుధవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్ గుప్తా మాట్లాడుతూ వర్షాకాలం వరి కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం నూర్పిడి చేసి ఆయా రైస్‌మిల్లుల నుంచి గాయత్రి గోదాంకు జనవరి 25 నుంచి లారీలలో తరలించారన్నారు. కాగా నెలలు గడుస్తున్న ఇంకా 15 లారీలు ఖాళీచేసి మరో 13 లారీలు అలాగే ఉంచడంతో తీవ్ర నష్ట జరుగుతుందన్నారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రపాల్ కక్షపూరితంగా వ్యవహరిస్తూ లారీలు ఖాళీ కాకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. గోదాంలకు లారీలలో తరలించిన బియ్యాన్ని ఖాళీ చేసేందుకు కార్మికులకు, అసోసియేషన్‌కు, గోదాం నిర్వాహకులకు సైతం డబ్బు ఇస్తున్నట్లు తెలిపారు. అయినా కక్షపూరిత చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈవిషయమైన గోదాం మేనేజర్ ఉపేందర్ మాట్లాడుతూ క్వాలిటీ కంట్రోలర్ సర్టిపై చేయకపోవడంతో లారీలు ఖాళీ చేయలేదన్నారు. జిల్లాకు క్వాలిటీ కంట్రోల్ ఒక్కడే ఉండటంతో ఆలస్యం అయిందని త్వరలో ఖాళీ చేస్తామన్నారు. ఈవిషయంపై డీఎస్ఓతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుత్‌బొద్దీన్ పాల్గొన్నారు.



గోదాం వద్ద ఆగి ఉన్న లారీలు

## ఆధారం, హక్కులు ఉంటేనే కోర్టు న్యాయం చేస్తుంది

మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శివరంజని

హుస్నాబాద్‌రూరల్: మనది అనే ఆధారం, హక్కులు ఉంటేనే కోర్టులను ఆశ్రయిస్తే బాధితులకు న్యాయం జరుగుతుందని, కుటుంబంలోని అనవసర విషయాలపై కేసులు పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోవద్దని మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. బుధవారం పోతారం(ఎస్) గ్రామంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించడానికి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వశక్తి మహిళలు తయారు చేస్తున్న పేపర్ ప్లేట్స్‌ను పరిశీలించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ మహిళలు న్యాణమైన వస్తువులను కొనుగోలు చేసినప్పుడు వ్యాపారులు నకిలీ వస్తువులు ఇస్తే పరిహారం కోసం జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు వేస్తే న్యాయం జరుగుతుందన్నారు.



పోతారం(ఎస్) న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శివరంజని

రూ.20 లక్షల వరకు జిల్లా వినియోగదారుల ఫోరంలో న్యాయ పోరాటం చేయవచ్చన్నారు. కుటుంబంలో చిన్ని విషయాలకు గొడవపడి కేసులు పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరిగితే సమయం వృథా అవుతుందని, రాజీపద్ధతిలో పరిష్కారించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ మహేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిని మల్లేశం, మురళీమోహన్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## అక్కన్నపేటలో కొనసాగుతున్న 'రిలే నిరాహార దీక్ష'

సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి తొందూరు ఎల్లయ్య చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం మూడో రోజుకు చేరింది. కాంగ్రెస్ మండల నాయకులు దీక్షకు సంపూర్ణ మద్దతును తెలుపుతూ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. మండల కేంద్రంలో 387 సర్వే నంబర్‌లో ప్రభుత్వం భూమి ఉందని, వెంటనే మార్కెట్ యార్డు నిర్మాణానికి పదేకాల భూమి, ఎస్టీ, ఎస్సీ బాలుర హాస్టల్ నిర్మాణానికి కూడా స్థలసేకరణ త్వరగా చేయాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఇంకెన్ని రోజులు కొనసాగుతాయని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఏర్పడిన అక్కన్నపేట మండలంపై చిన్నచూపు తగదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, పట్టణాధ్యక్షుడు చింతల మల్లారెడ్డి, కట్కూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్ ముకుందరెడ్డి, బండి కుమార్, మాజీ సర్పంచ్ కాశబోయిన ఎల్లయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## పేలిన వెల్డింగ్ గ్యాస్ సిలిండర్

యువకుడికి గాయాలు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని గాంధీ బొమ్మ సమీప శ్రీఆదిత్య స్టీల్ ఫర్నిచర్ షాపులో బుధవారం రాత్రి వెల్డింగ్ గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ సంఘటనలో షాపులో పనిచేసే ఉత్తరప్రదేశ్‌కి చెందిన సూరజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్టీల్ ఫర్నిచర్ షాపులో బీరువాలు, గృహోపకరవస్తువులు తయారుచేస్తుంటారు. ఇవి తయారు చేసేందుకు గ్యాస్ సిలిండర్, రంగులు వేసేందుకు కంప్రెషర్‌ను వాడతారు. రోజువారీలాగే పనులు చేసేక్రమంలో ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో సూరజ్ తలకు గాయమైంది. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో పరిసర ప్రాంత ప్రజలు ఉలిక్కిపడ్డారు. కాసేపటికి తేరుకుని గాయపడ్డ సూరజ్‌ను స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

## వేర్వేరుచోట్ల ముగ్గురి ఆత్మహత్య



సంగమేశ్ (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా రేగోడ్ మండలం, గజ్వాడ గ్రామానికి చెందిన సంగమేశ్(38) బతుకుదెరువు కోసం పదేళ్లక్రితం పటాన్‌చెరు వచ్చాడు. గొల్లబస్తీలో నివాసం ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. 20 రోజుల క్రితం భార్య పద్మ, సంగమేశ్ గొడవపడ్డారు. దీంతో భార్యా పుట్టిల్లయిన మెదక్ మల్లంపేటకు వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన సంగమేశ్ మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి దుర్గమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**అప్పుల బాధతో రైతు..**

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని చెప్యాల శివారులో దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామానికి చెందిన రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం జరిగింది. మిరుదొడ్డి ఎస్ఐ శ్రీధర్‌గౌడ్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దొమ్మాటకు చెందిన చిన్నబుల్లి బక్కులు (50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పులు చేసి తన ముగ్గురు ఆడ పిల్లలకు వివాహాలు జరిపించాడు. అవి తీరే మార్గం కానరాక మదన పడుతుండేవాడు. అప్పుల బాధతో తీవ్ర మనస్తాపానికి గురైన చిన్నబుల్లి బక్కులు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక): చిన్న బుల్లి బక్కులు మృతదేహం

**విద్యుదాఘాతంతో మరొకరు..**

తొగుట(దుబ్బాక): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని యల్.బంజేరుపల్లిలో బుధవారం జరిగింది. తొగుట పోలీసులు, గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పిట్ల రామస్వామి (32) వ్యవసాయం చేస్తున్నాడు. బుధవారం తెల్లవారు ఝామున వరి పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. కాగా మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు కరెంటు తీగలు తెగి రామస్వామి పొలంలో పడ్డాయి. ఇది గమనించకుండా నీరు పెడుతున్న క్రమంలో కరెంటు తీగలు కాలిగి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పొలానికి వెళ్లిన రామస్వామి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే పొలానికి వెళ్లి చూడగా విగతజీవిగా పడి కనిపించాడు.



రామస్వామి మృతదేహం



గజవాహనంపై ఊరేగుతున్న నాచగిరీశుడు

# గజవాహనుడి దివ్యదర్శనం

నాచగిరిలో బ్రహ్మోత్సవ పరిమళం

వర్గల్(గజ్వేల్): బ్రహ్మోత్సవాలతో నాచగిరి అలరారుతోంది. ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి శ్రీలక్ష్మీనృసింహస్వామివారు గజవాహనం అధిష్ఠించి పురవీధుల్లో ఊరేగారు. నేత్రపర్వంగా సాగిన ఈ మహోత్సవాన్ని భక్తజనులు ప్రత్యక్షంగా తిలకించి తరించారు. స్వామివారి ఆశీస్సులు పొందారు. ఉత్సవాల నేపథ్యంలో ఉదయం అర్చకులు గర్భగుడిలో మూలవిరాట్టులకు పంచామృతాభిషేకం, అలంకారసేవ జరిపారు. యాగశాలలో హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. దర్శనానికి ఇబ్బంది కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ సుధాకర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్ తదితర ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

**నేడు శేషవాహన సేవ**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శేషవాహనోత్సవ సేవ జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్వామివారి వాహన సేవలో పాల్గొని తరించాలని కోరారు.

## ఫుల్‌జోష్‌తో సీఎం కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ

35 బంతులు 100 పరుగులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ క్రికెట్ స్టేడియంలో సీఎం కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ ఫుల్‌జోష్‌తో కొనసాగుతోంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లలో ఆల్‌ఫతే, ఎంజీ, బీడీ కాలనీ, టాడ్‌మినియన్స్, అంబేడ్కర్ అజాద్ జట్లు ప్రత్యర్థి జట్లపై విజయం సాధించాయి. ఖాజా అబ్దుల్ అబీద్, అజయ్, జగదీష్, మొఖిల్, ఆఫ్రీదీలు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌లుగా నిలిచారు. కాగా అంబేడ్కర్ అజాద్ జట్టు క్రీడాకారుడు ఆఫ్రీది 35 బంతుల్లో సెంచరీ చేశాడు. మొత్తం 135 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలవడంతో క్రీడాభిమానుల్లో ఫుల్‌జోష్ కనిపించింది. కార్యక్రమంలో ట్రోఫీ నిర్వాహకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కలకుంట్ల మల్లికార్జున్, డాక్టర్ మహేష్, బజ్జీ తదితరులు పాల్గొన్నారు.



ఆఫ్రీదికి అవార్డు అందిస్తున్న మచ్చవేణుగోపాల్‌రెడ్డి తదితరులు

## ప్లాట్ల కబ్జాకు యత్నిస్తున్నారని ఫిర్యాదు

- కోర్టు వివాదంలో భూమి
- పలువురిపై కేసు నమోదు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్ళకల్ గ్రామ శివారులోగల సర్వే నంబర్ 311, 312, 313 లలో ఏర్పాటు చేసిన వెంచర్‌లోగల ప్లాట్ల స్థలం వివాదంలో ఉందని, ఆ భూమిని కబ్జాకు ప్రయత్నిస్తున్నారని బాధితుడు చంద్రశేఖర్ పోలీసులకు పలువురిపై ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కోనాయపల్లి(పీటీ) గ్రామ పంచాయతీ పరిధిలోని ధర్మరాజ్‌పల్లికి చెందిన భాషబోయిన చంద్రశేఖర్, మెట్టు బాలకృష్ణారెడ్డి, నాగుల్లపల్లికి చెందిన భగవాన్‌రెడ్డి, కాళ్ళకల్ గ్రామానికి చెందిన నత్తి వంశీ కాళ్ళకల్‌లోని వెంచర్‌లో 38, 39, 40 ,41 ప్లాట్లలోగల 1056 చదరపు గజాల భూమిని ఎస్ఆర్‌ఓ తూప్రాన్‌లో కొనుగోలు చేశాడు. ఆ భూమిని కాళ్ళకల్ గ్రామానికి చెందిన ఇంద్రకరణ్ సీతారాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి కబ్జాకు యత్నిస్తున్నారని బాధితుడు ఫిర్యాదులో ఆరోపించాడు. దీంతో ఈ వివాదంలో కోర్టుకు చేరింది. ఈ భూమిలో ఈనెల 12న గిరిధర్‌రెడ్డి, యాంజాల్ సుధాకర్‌రెడ్డితో కలిసి కంకర, ఇసుక, తదితర వాటిని డంప్ చేయడానికి అక్రమంగా తమ ప్లాట్లలోకి ప్రవేశించారని, ఇదేమని ప్రశ్నిస్తే తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీతారాం రెడ్డి, గిరిధర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: వేర్వేరు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. పటాన్‌చెరు మండలం లక్డారం గేటు వద్ద బుధవారం తెల్లవారు జామున టాటా ఏస్ వాహనాన్ని టిప్పర్ ఢీకొంది దీంతో టిప్పర్ డ్రైవర్ జయవంత్ గాయపడటంతో వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు పన్నీరు లోడు తీసుకొస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలిసింది. అదేవిధంగా పటాన్‌చెరు మండలం ముత్తంగి స్వీట్ హార్ట్ హోటల్ సమీపంలో ఆటోను లారీ ఢీకొట్టింది. ఆటో బోల్తా పడగా ఇంటర్ విద్యార్థిని రాజేశ్వరి, ఆటోలో వెళ్తున్న మరో వ్యక్తి లోకేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే చిట్కుల్ తెలంగాణ గురుకుల సాంఘిక సంక్షేమ వసతి గృహం ఇంటర్ విద్యార్థిని రాజేశ్వరి అనారోగ్యంతో బాధపడుతుండటంతో నలుగురు సిబ్బంది, మరో విద్యార్థినితో కలిసి మంగళవారం రాత్రి పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వస్తుండగా ప్రమాదం జరిగింది.

**ఆటో బోల్తా..**

మనోహరాబాద్(తూప్రాన్): ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తాపడటంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని రామాయపల్లి సమీప 44 జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ నుంచి ప్రయాణికులతో ఆటో మేడ్చల్ వెళ్తోంది. రామాయపల్లి శివారు జాతీయ రహదారిపై బోల్తాపడింది. దీంతో మేడ్చల్ మండలం నూతన్‌కల్ గ్రామానికి చెందిన మల్లేష్, వెంకటాపూర్(అగ్రహారం) గ్రామానికి రజనీకి తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్సులో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ పరారయ్యాడని స్థానికులు తెలిపారు.



ఆటో ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

**చికిత్స పొందుతున్న మహిళ మృతి**

సిద్దిపేటఅర్బన్: అప్పుల బాధతో మహిళ ఆత్మహత్యకు యత్నించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ మేరకు సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు సీఐ భానుప్రకాష్ తెలిపారు. ఎన్సాన్‌పల్లికి చెందిన దప్పు మైసయ్య, దుర్గవ్వ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెల వివాహం సందర్భంగా చేసిన అప్పులు తీరకపోవడంతో కొంత కాలంగా భార్యాభర్తలు అప్పుల బాధతో సతమతమవుతున్నారు. ఈ క్రమంలో దుర్గవ్వ (58) ఈనెల 11న ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది.

## మల్‌చల్మ గ్రామాన్ని సందర్శించిన ఫారెస్ట్ అధికారులు

పులి సంచరిస్తోందనే అనుమానంతో ఫిర్యాదు చేసిన సర్పంచ్

జహీరాబాద్: మండలంలోని మల్‌చల్మ గ్రామాన్ని బుధవారం ఫారెస్ట్ అధికారులు సందర్శించారు. గ్రామంలో పులి సంచరిస్తోందని సర్పంచ్ ఎం.పాండురంగారెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా ఫారెస్ట్ అధికారి శ్రీధర్ రావు, జహీరాబాద్ రేంజ్ అధికారి రాధికా రెడ్డి, సిబ్బంది, గ్రామస్తులతో కలిసి గ్రామ శివారును పరిశీలించారు. గ్రామంలో మూడు రోజులుగా పులి సంచరిస్తోందని, దీంతో ప్రజలు భయభ్రాంతులు చెందుతున్నారని సర్పంచ్ అటవీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. పక్కనే ఉన్న జాడీమల్కాపూర్ శివారులోని కర్ణాటక పరిధిలో ఉన్న చెట్లవెంకటాపూర్ గ్రామంలో పులి ఆవుదూడలను చంపిన విషయం తెలిసిందే. దీంతో తమ గ్రామంలోనూ పులి సంచరిస్తోందని గ్రామస్తులు ఆందోళన చెందుతుండటంతో ఫారెస్ట్ అధికారులు గ్రామాన్ని సందర్శించి పాద ముద్రలను పరిశీలించారు. మూడు రోజులుగా పెద్దపులి, చిరుతపులి గ్రామ శివారులో సంచరించిన ఆనవాళ్లు లేవన్నారు. హైనా సంచరించి ఉండవచ్చని ఫారెస్టు అధికారులు తెలిపారు. రాత్రి వేళలో తగిన జాగ్రతలు తీసుకోవాలని గ్రామస్తులకు వారు సూచించారు.



మల్‌చల్మ గ్రామ శివారును పరిశీలిస్తున్న అటవీ అధికారులు

## చిరుత కాదు.. హైనా..

జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీధర్‌రావు

కోహీర్(జహీరాబాద్): గత వారం రోజులుగా చిరుతపులి ఉనికికి సంబంధించిన వదంతులకు ఎట్టకేలకు తెరపడింది. మండలంలోని గొడిగార్‌పల్లి అటవీ ప్రాంతంలో కనిపించిన పాదముద్రలు చిరుతపులివి కావని, హైనా పాదముద్రలని జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీధర్‌రావు స్పష్టం చేశారు. బుధవారం ఎఫ్ఆర్‌ఓ రాధికా రెడ్డి, సెక్షన్ అధికారి అమరేందర్, బీట్ అధికారి వరప్రసాద్‌తో కలిసి మండలంలోని గొడిగార్‌పల్లి, బడంపేట ప్రాంతంలోని అటవీ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో కనిపించిన పాదముద్రలను పరిశీలించారు. కోహీర్ మండలంలోని అటవీ ప్రాంతంలో పులి ఉండే ఆస్కారమే లేదన్నారు. చిరుతపులులు కూడా లేవన్నారు. కనిపించిన అడుగులు చిరుతపులివి కావని, హైనా వని స్పష్టం చేశారు. చిరుతపులి, హైనా పాదముద్రలకు మధ్య తేడాలను వివరించారు. హైనా క్రూర మృగమే అయినప్పటికీ మనుషులపై దాడి చేయదన్నారు. హైనా తారసపడితే హాని తలపెట్టవద్దని, అప్రమత్తంగా ఉంటే చాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు పులి వదంతులకు తెరదించడంతో మండల ప్రజలు ముఖ్యంగా అటవీ పరిసర ప్రాంతాల్లో పొలాలు ఉన్న రైతుల ఆందోళనకు తెరపడింది.



గొడిగార్‌పల్లి పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తున్న డీఎఫ్ఓ శ్రీధర్‌రావు

# శ్రీకర పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- ఇద్దరు కార్మికులకు గాయాలు
- నెలలో రెండో ప్రమాదం

జిన్నారం(పటాన్‌చెరు): నెలలో రెండో ప్రమాదం జరిగింది. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 3వ తేదీన జరిగిన ప్రమాదంలో ఐదుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరు కార్మికులు మృతి చెందారని తోటి కార్మికులు చెప్పారు. మంగళవారం అర్ధరాత్రి మండలంలోని ఓ ఆర్గానిక్స్ పరిశ్రమలో మరో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. సీఐ సురేందర్‌రెడ్డి, తోటి కార్మికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బొల్లారం పారిశ్రామికవాడలోని శ్రీకర ఆర్గానిక్స్ పరిశ్రమలో ఎప్పటిలాగే కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి ఒంటి గంట సమయంలో ఒకటో నంబర్ బ్లాకులో రసాయనాలను కలుపుతుండగా ఒక్కసారిగా అగ్ని ప్రమాదం సంభవించింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న సృజలాల్ సింగ్(19), సందీప్‌సింగ్(19) గాయపడ్డారు. వీరిద్దరు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు. తక్షణమే పరిశ్రమయాజమాన్యం స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడ్డ కార్మికులను సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ నెలలో ఇది రెండో ప్రమాదం కావటంతో పరిశ్రమలో విధులు నిర్వహించేందుకు కార్మికులు భయపడుతున్నారు. ఇలాంటి పరిశ్రమలపై పరిశ్రమల శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకొని, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, గాయపడిన కార్మికులకు ప్రాణాపాయంలేదని సీఐ తెలిపారు.



గాయపడ్డ కార్మికులు